క్లుప్తంగా

న్యూఇయర్ వేడుకల్లో నిబంధనలు పాటించాలి

నాదెండ్ల: నూతన సంవత్సర వేడుకల్లో ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై జి.పుల్లారావు చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జనవరి 1వ తేది సాయంత్రం వరకూ పోలీసు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపటం, సైలెన్సర్లు లేని వాహనాలు నడపటం, డీజేలకు అనుమతి లేదన్నారు. వీధుల్లో రంగవల్లులు వేసే మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయం పాటించి నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలు, నాయకులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనల మేరకే న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా పోలీసులు అధికారుల ఆదేశాల మేరకు నిబంధనలు వర్తిస్తాయని టౌన్ సీఐ శోభన్‌బాబు తెలిపారు. రాత్రి 10.30 గంటల వరకు మాత్రమే రోడ్లపై తిరిగేందుకు అనుమతి ఉందని, ఆ తరువాత నిషేధ ఆజ్ఞలు ఉన్నట్లు వివరించారు. మద్యంసేవించి వాహనాలను నడపడం, రోడ్లపై కేక్ కటింగ్ చేసినా, మైక్ సౌండ్లు, బాణాసంచా వంటి వాటిని నిషేధించినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

చెస్ పోటీల విజేతలకు బహుమతులు అందజేత



చిలకలూరిపేట: పట్టణంలోని సాయి వికాస్ స్కూల్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అండర్–12, అండర్ –10, అండర్–08 చెస్ పోటీలు నిర్వహించారు. నియోజక వర్గంలోని వివిధ పాఠశాలల నుంచి 130 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వయసుల వారీగా మూడు విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలలో ప్రతి విభాగంలోనూ ముగ్గురు విద్యార్థులను విజేతలుగా ఎంపిక చేసి నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు, పతకాలు అందించారు. కార్యక్రమంలో సాయివికాస్ స్కూల్ డైరెక్టర్ ఎస్.వీరాస్వామి, వెటర్నరీ డాక్టర్ అయేషా బేగం, చెస్ ఆర్బిటర్ కె.కిరణ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్‌ను కలిసిన పాలేష్



వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలుపై రాజీవ్ రంజన్ మిశ్రా చైర్మన్‌గా ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌ను గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు, పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెద్దిటి పాలేష్ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాలేష్ ఎస్సీ వర్గీకరణ అమలు ఆవశ్యకతను కమిషన్‌కు వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు కొన్ని కులాలు రిజర్వేషన్లకు నోచుకోలేదని, ఎస్సీలలో వెనుకబడిన కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని వెంటనే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు చేయాలని కోరారు. ఎస్సీల్లోని అన్ని కులాలు అభివృద్ధి చెందాలంటే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అనివార్యమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పాలేష్ విజ్ఞప్తి చేశారు.

బీజేపీ శావల్యాపురం మండలాధ్యక్షుడిగా గట్టుపల్లి



శ్రీనివాసరావును సత్కరిస్తున్న నాయకులు

శావల్యాపురం: మండల బీజేపీ అధ్యక్షులుగా వేల్పూరు వాసీ గట్టుపల్లి శ్రీనివాసరావును సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రమైన శావల్యాపురంలో గడుపూడి వెంకట రాయుడు గెస్ట్ హౌస్‌లో మండల బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ బీజేపీ పార్టీ కన్వీనర్ యార్లగడ్డ లెనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి మేడం రమేష్ పాల్గొని నూతనంగా ఎన్నికైన మండల పార్టీ అధ్యక్షులు గట్టుపల్లి శ్రీనివాసరావు పూలమాలతో దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షులు ఆలోకం శ్రీనివాసరావు, గోరంట్ల సత్యనారాయణ తదితరులకు తన నియామకానికి సహకరించిన వారందరికీ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాది వెంకయ్య, రావినూతల ఆదాం, పాటిబండ్ల ఆంజనేయ ప్రసాదు పాల్గొన్నారు.

పర్యాటకం కళతప్పింది!

పిలిస్తే పలికేవాడిగా పేరొందిన వాడు కోటయ్య స్వామి. ఇక ఆయన సన్నిధికి వెడితే పెద్దలకు భక్తి – పిల్లలకు ఆసక్తి కలిగేలా నాటి పాలకులు ఇక్కడ ఏర్పాట్లు చేశారు. ఇవాళ పచ్చని చెట్లతో కనిపించాల్సిన అక్కడి ఎమ్యూజ్‌మెంట్ పార్క్ కళావిహీనమైంది. పట్టించుకునే వారు లేక నేడు బోసిబోయి పిచ్చిచెట్లతో కనిపిస్తోంది.

- కోటప్పకొండలో టూరిజం ఎమ్యూజ్‌మెంట్ పార్క్ కళావిహీనం
- పర్యవేక్షణ లేకపోవడంతో అధ్వానంగా మారిన వైనం
- పిచ్చిమొక్కలతో నిండిన ప్రాంగణం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



పిచ్చిమొక్కలతో నిండిన పార్క్

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ దిగువన నల్లచెరువు వద్ద ఏర్పాటు చేసిన ఏపీ టూరిజం ఎమ్యూజ్‌మెంట్ పార్క్ కళ తప్పింది. కోట్లాది రూపాయల వ్యయంతో 2016లో ఈ పార్క్‌ను ఏర్పాటు చేశారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యాత్రికులను ఆకట్టుకునే విధంగా ఇక్కడ పలు సదుపాయాలు కల్పించారు. బోటుషికారు, రెస్టారెంట్, యాంపి థియేటర్‌తో పాటు యాత్రికులు సేద తీరే హట్స్ విధంగా ఇక్కడ అందుబాటులో ఉంచారు. ఇదే ప్రాంతంలో రోప్‌వే కూడా వస్తుందనే భావనతో పర్యాటక శాఖ నిధులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టింది. తరువాత రోప్‌వే పనులు మధ్యలోనే నిలిచి పోవడంతో యాత్రికుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది.

గత ప్రభుత్వంలో పునరుద్ధరణకు చర్యలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి పరిచేందుకు అప్పటి జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు విశేషంగా కృషిచేశారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక కేంద్రానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా చర్యలూ తీసుకున్నారు. రెస్టారెంట్‌ను ప్రారంభించడంతో పాటు జలవిహార్ పేరుతో నల్లచెరువులో బోటు షికారును ప్రారంభించారు. దీంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు కళావేదికను దాతల సహకారంతో నిర్మించారు. వీకెండ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

నేడు కళావిహీనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పర్యాటక కేంద్రాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీంతో పచ్చని చెట్లతో ఆకర్షణీయంగా కనిపించే ప్రాంతంలో నేడు పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. రెస్టారెంట్‌లోని తలుపులను సైతం దుండగులు ధ్వంసం చేశారు. పట్టణానికి చెందిన కపలవాయి విజయకుమార్ సహకారంతో సుమారు రూ.7 లక్షల వ్యయంతో నిర్మించిన కళావేదికను



దుండగులు కూల్చివేసిన కళావేదిక ప్రాంగణం

సైతం దుండగులు కూల్చివేశారు. పార్క్‌లో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. పగటి వేళల్లో సైతం ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయి. యాత్రికుల సేదతీరేందుకు ఏర్పాటు చేసిన పర్యాటక ప్రాంతం ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కళావిహీనంగా మారడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త!

- యడ్లపాడు వాసులిద్దరికీ బెదిరింపు కాల్స్
- టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేసిన బాధితులు

యడ్లపాడు: క్రెడిట్ కార్డుపై తీసుకున్న బాకీ తక్షణమే తమకు చెల్లించకుంటే అరెస్టు వారెంట్ జారీ చేయాల్సి ఉంటుందని సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు గురిచేసిన ఘటనలు ఆలస్యంగా వెలుగు చూశాయి. సదరు బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... యడ్లపాడు గ్రామానికి చెందిన వీరాంజనేయులుకు ఈనెల 25న యడ్లపాడుకు చెందిన వీరాంజనేయులుకు ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం గుర్తు తెలియని వారి నుంచి వీడియో వాట్సప్ కాల్ వచ్చింది. ముందు హిందీలో మాట్లాడిన సదరు కాలర్ తర్వాత తెలుగులోనూ సంభాషణను కొనసాగించాడు. స్టేట్‌బ్యాంకు క్రెడిట్ కార్డు బాకీ రూ.1,06,965 చెల్లించలేదని అరెస్టు వారంట్ ఉందని వెంటనే నగదు చెల్లించాలని వీరాంజనేయులు బెదిరించాడు. వెంటనే తనకు ఆధార్‌కార్డు పంపాలంటూ బలవంతంగా వాట్సప్‌కు పెట్టించుకున్నాడు. అనుమానం వచ్చిన వీరాంజనేయులు తాను ఇటీవల ఎస్‌బీఐలో క్రెడిట్‌కార్డుకు కోసం దరఖాస్తు చేశానని, అయితే కార్డు ఇంకా తనకు ఇవ్వలేదని సమాధానం చెప్పాడు. కాబట్టి తాను ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదంటూ చెప్పి కాల్ కట్ చేశాడు. అనంతరం వీరాంజనేయులు వాట్సప్‌కు ఫొటోతో కూడిన నకిలీ ఆధార్ పత్రం పంపించాడు. సదరు ఘటనపై అదేరోజు టోల్‌ఫ్రీ నంబర్ 1903కు డయల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఇటీవల ఇదే తరహాలో యడ్లపాడుకు చెందిన రమణకు ఇదే తరహా సైబర్ కాల్ వచ్చినట్లు తెలిపారు.

ఈ విషయంపై యడ్లపాడు ఎస్ఐ వి.బాలకృష్ణ స్పందిస్తూ నిత్యం సైబర్ మోసగాళ్లు ఇదే తరహాలో ఎక్కువగా మోసాలకు పాల్పడుతున్నారని, వీటిపై ప్రతి సెల్‌ఫోన్లలోనూ ప్రచారం జరుగుతుందన్నారు. ప్రజలు తమకు తెలియని వారికి ఎవ్వరికీ వాట్సప్, సోషల్ మీడియాల్లో తమకు సంబంధించిన ఆధారాలు, సమాచారం ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

మేజరు కాల్వను పరిశీలించిన డీసీ చైర్మన్

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని త్రిపురాపురం మేజరు కాలువను చైర్మన్ గంగినేని రాఘవ రావు ఎన్నెస్పీ అధికారులు సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా డీసీ చైర్మన్ రాఘవ రావు మాట్లాడుతూ కాలువ రహదారి మార్గంలో ఉన్నటువంటి గుంతలు మరమ్మతులు చేపట్టి రైతులకు సౌకర్యంగా ఉండేలా అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాల్వ వెంట నడకదారి మర్గాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు కంభంపాడు ఉప సర్పంచ్ మేదర మెట్ల అనిల్‌కుమార్,గోవిందయ్య, రామారావు, ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి ఓ వ్యక్తి మృతి

బొల్లాపల్లి: పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని వెల్లటూరు గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, సేకరించిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జెట్టి హనుమంత రావు (42) పురుగు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హనుమంతరావు వారం రోజుల క్రితం పురుగుమందు సేవించగా ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య వీరాంజమ్మ, కుమార్తె, కుమారుడు కలరు. కుమార్తె అనూష నరసరావుపేటలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ ఇటీవల మృతి చెందిన విషయంతో తీవ్ర మనస్థాపానికి గురై పురుగుమందు సేవించాడని తెలిసింది. కుమార్తె మృతి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు.

సూరె సీతమ్మ ట్రస్టు సేవలు అభినందనీయం

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు

ఈపూరు (శావల్యాపురం): సూరె సీతమ్మ ట్రస్టు సేవలు అభినందనీయమని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు అన్నారు. సోమవారం మండలంలోని అరేపల్లి ముప్పాళ్ళ గ్రామంలో సూరె సీతమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంప్యూటరు కోచింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, 300 మందికి పేద విద్యార్థులకు విద్యా సామగ్రి, టీ షర్టులు, ప్యాంటు షర్టులు, పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ ట్రస్టు ప్రారంభించి ఏడాది పూర్తి అయిన సందర్భంతో పాటు రతన్ టాటా జన్మదిన వేడుకలకు పేదలకు సేవా చేయటం చాలా సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో ట్రస్టు అభ్యున్నతి తనవంతు సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సూరె సీతమ్మ ట్రస్టు భవిష్యత్ మరిన్నో కార్యక్రమాలు చేపట్టి పేద విద్యార్థులకు అండగా ఉండటంతో పాటు వారి చేయూతకు కృషి చేయాలన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఐక్యవేదిక నాయకుల నిరసన



డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియ చేస్తున్న వామపక్ష ఐక్యవేదిక నాయకులు

నరసరావుపేట: పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచిన కేంద్ర మంత్రి అమిత్ షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పల్నాడు జిల్లా కమిటీ వామపక్షాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్టేషన్‌రోడ్డులోని గాంధీ పార్కు వద్ద నుంచి గడియారస్తంభం సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ అధ్యక్షతన అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ.మారుతీ వరప్రసాద్, ఎంసీపీఐయు నాయకులు రెడ్ బాషా, కేఎస్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని అవమానించి బీజేపీ నూతన రాజ్యాంగాన్ని ప్రవేశపెట్టాలనే దుర్మార్గమైన ఆలోచన చేస్తుందని, కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బోయపాటి రామాంజనేయులు, షేక్ నాగూర్, లిబరేషన్ నాయకులు షేక్ ఫిరోజ్, భాస్కర్ ప్రసాద్, వెంకటేశ్వర, పిడుగు విజయకుమార్, రమేష్, దుర్గాప్రసాద్, వందనం తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించడం దుర్మార్గం

వినుకొండ(నూజెండ్ల): దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీల పిలుపుమేరకు వినుకొండ పట్టణంలోని శివయ్యస్థూపం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ని అవమానించడం దుర్మార్గమని, అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సీపీఎంఎల్ నాయకులు తోట ఆంజనేయులు

కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

చిలకలూరిపేట: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి తాళ్లూరి బాబురావు, సీపీఎం జిల్లా నాయకులు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం సోమవారం నిర్వహించారు.

ఆ... వ్యాపారిని వెంటనే అరెస్టు చేయాలి

- ధాన్యం స్వాధీనం చేసుకొని కౌలు రైతుకి అప్పగించాలి
- రైతు సంఘ జిల్లా నాయకుల డిమాండ్



కౌలురైతును పరామర్శిస్తున్న నాయకులు

నరసరావుపేట: నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామానికి చెందిన పురుగు మందుల వ్యాపారి కనుమూరి రాజేంద్రప్రసాద్ డబ్బులు చెల్లించాలని వత్తిడి చేస్తూ రైతు కల్లంలోని 80 బస్తాల ధాన్యాన్ని దౌర్జన్యంగా తీసుకెళ్లడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కౌలు రైతు చెన్నంశెట్టి కోటేశ్వరరావు పురుగు మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశాడని ఏపీ కౌలు రైతు సంఘ నాయకులు పేర్కొన్నారు. స్థానిక శ్రీకేర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రైతును సోమవారం కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.రామారావు, వై.రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఈపూరి లక్ష్మారెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. కౌలురైతు భార్య సరోజిని జరిగిన విషయాన్ని వారికి తెలియచేసింది. మూడేళ్ల క్రితం తాము నాలుగు ఎకరాల మాగాణితో పాటు ఎకరంన్నరలో మిర్చి పంట వేశామని, ఆ పంటకు అవసరమైన పురుగు మందులను రాజేంద్రప్రసాద్ షాపులో అప్పుగా తీసుకున్నామన్నారు. ఆ ఏడాది మిర్చి పంటపై వచ్చిన నల్లి తెగులు వలన పంట పూర్తిగా దెబ్బతినడంతో అప్పు చెల్లించలేకపోయామన్నారు. దీనిపై నాయకులు మాట్లాడుతూ రైతు కోటేశ్వరరావు వెంటనే వ్యాపారిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు ఏరకమైన చర్యలు తీసుకోలేదు అన్నారు. ప్రభుత్వం వెంటనే కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని, మెరుగైన వైద్య చికిత్స అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలురైతుల అప్పులన్నింటినీ ఒకసారి మాఫీ చేయాలని, ఆత్మహత్యకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యువకుడిపై బీరు సీసాలతో దాడి



చికిత్స పొందుతున్న తాటి రణధీర్

నరసరావుపేట టౌన్: పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై బీరు సీసీలతో దాడికి పాల్పడిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని ఓ మద్యం దుకాణంలో చోటు చేసుకుంది. బాధితుడిచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. ఐలాబజార్‌కు చెందిన తాటి రణధీర్ మద్యం సేవించేందుకు వినుకొండ రోడ్డులోని నవయుగ వైన్స్ కు వెళ్లాడు. అక్కడ అప్పటికే మద్యం సేవిస్తున్న కుమరపల్లి శివ, పికిలి వెంకటేష్ మరో ఇద్దరు కలిసి పాత గొడవలను దృష్టిలో ఉంచుకొని రణధీర్‌తో వాగ్వివాదానికి దిగారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ బీరుసీసాలతో దాడి చేశారు. సంఘటనలో రణధీర్‌కు మెడ, పొట్ట, చేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుడిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ సోమవారం తెలిపారు.

మురుగునీటి సమస్య ముంచెత్తుతోంది

- మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహణ
- 2025–26 బడ్జెట్‌కు ఆమోదం



అధ్యక్షత వహించిన షేక్ రఫాని



మాట్లాడుతున్న వలేటి వెంకటేశ్వరరావు

చిలకలూరిపేట: పట్టణంలోని మురుగునీరు గణపవరం వైపు మళ్లిస్తున్నారు, ఎన్నిసార్లు కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించినా పట్టించుకోవడం లేదు. అంటూ మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం, ప్రత్యేక బడ్జెట్ సమావేశాలను సోమవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మురుగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీకి చెందిన నాల్గో వార్డు కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సింగిల్ టెండర్లు ఆమోదించవద్దని, ఎజెండాలో పొందు పరిచిన సింగిల్ టెండర్లను సైతం రద్దు చేయాలని కోరారు. మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా టెండర్లు పిలవడం జరిగిందని, సింగిల్ టెండర్ మాత్రమే దాఖలు కావడంతో అదే ఎజెండాలో పొందుపరిచామని సమాధానం చెప్పారు. తిరిగి గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణంలో ఆక్రమణల తొలగింపులో టౌన్ ప్లానింగ్ అధికారులు ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారని, టౌన్ ప్లానింగ్ అధికారి సమావేశానికి ఎందుకు హాజరుకాలేదని నిలదీశారు. 37వ వార్డు కౌన్సిలర్ పి.శివకుమారి మాట్లాడుతూ శానిటేషన్ సరిగా నిర్వహించటం లేదని, వార్డుకు అడిగినంత మంది సిబ్బందిని కేటాయించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత శానిటరీ ఇన్స్‌పెక్టర్ తన కారుకు కూడా డ్రైవర్‌గా మున్సిపల్ సిబ్బందిని ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. టేబుల్ ఎజెండాగా 31వ వార్డు కౌన్సిలర్ విడదల వేణు గోపీనాథ్ వరుసగా ఆరు కౌన్సిల్ సమావేశాలకు హాజరు కానందున ఆయన సభ్యత్వం రద్దు చేస్తున్నట్లు పొందుపరిచారు.

బడ్జెట్‌కు ఆమోదం

2025–26 ఆర్థిక సంవత్సరానికి పురపాలక సంఘ బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశ పెట్టారు. ప్రారంభ నిల్వగా రూ. 39.42 కోట్లు, వివిధ పద్దుల నుంచి ఆదాయంగా రూ. 35 కోట్లు, ఖర్చు రూ. 29.08 కోట్లు కాగలదని, రూ. 6.27 కోట్లు ముగింపు నిల్వగా చూపారు.

ఆదాయానికి సంబంధించి ఆస్తి పన్ను ద్వారా రూ. 15.05 కోట్లు, సర్‌చార్జి ఆన్ స్టాంప్‌డ్యూటీ కింద రూ. 5కోట్లు, షాపుల అద్దెల ద్వారా రూ. 3.64 కోట్లు, యూజర్ చార్జీల ద్వారా రూ. 10.01 కోట్లు, చిల్లర జమల ద్వారా రూ.1.60 కోట్లు రాగలదని అంచనా వేశారు. సాధారణ ఖర్చులకు సంబంధించి జీతభత్యాలకు రూ. 3.24 కోట్లు, నీటి సరఫరా ఖర్చుకు రూ. 5.30 కోట్లు, రోడ్ల నిర్వహణ ఖర్చుకు రూ. 0.65 కోట్లు, వీధి దీపాలకు రూ. 2.15 కోట్లు, డ్రెయిన్ల నిర్వహణకు రూ.1.05 కోట్లు, అమృత్ రుణం వడ్డీ చెల్లింపుకు రూ. 2 కోట్లు, భవన మరమ్మతులు, పార్కులు, ఇతర ఖర్చులకు రూ. 2.28 కోట్లు ఖర్చు కాగలదని అంచనా వేశారు.

రైతులను 'రెవెన్యూ' ఇబ్బంది పెడుతోంది!

- ఇన్‌చార్జి వీఆర్వోపై చర్యలు తీసుకోండి
- ఆర్డీవోకు ప్రజాసంఘాల వినతి



ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారికి వినతి పత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: శావల్యాపురం మండలం పిచ్చుకల పాలెం రెవెన్యూ ఇన్‌చార్జి వీఆర్వోగా వ్యవహరిస్తున్న కనుమలపూడి వీఆర్వో నరసింహారావుపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు ఆర్డీవోను కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో పోస్టర్లు ప్రదర్శించి పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు మాట్లాడుతూ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్లిన రైతుల పట్ల శావల్యాపురం తహసీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వీఆర్వో నరసింహారావు రెవెన్యూ సదస్సులో అర్జీలు ఇచ్చిన రైతులను పెద్ద మొత్తంలో ఖర్చులు అవుతాయని, రకరకాల కారణాలు చెప్పి డబ్బులు ఇచ్చిన వాళ్లకే పరిష్కారం చేస్తామని, లేకపోతే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు.

మండలంలో వీరు చెప్పిందే రెవెన్యూ చట్టంలా అధికారులు, నరసింహారావు వ్యవహరిస్తున్నారని అన్నారు. గాలి వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన 45 సెంట్ల భూమిని సీతయ్య అనే అతను రెవెన్యూ వాళ్లతో కుమ్మక్కై ఆన్‌లైన్ చేయించుకుని వేరే వాళ్లకు అమ్ముకున్నాడని, దీనికి శావల్యాపురం మండల రెవెన్యూ అధికారులే కారణమని ఆరోపించారు. అలాగే రీ–సర్వేలో అనేక లోపాలు జరిగాయని, ఒకరి భూములు మరొకరికి ఎక్కించడం జరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ క్యాన్సిలేషన్ చేసుకున్న వారి వివరాలు ఆన్‌లైన్ చేయాలంటే డబ్బులు ఇస్తేనే, లేకపోతే లేదంటూ అర్జీదారులను ఆఫీసుల చుట్టూ తిప్పిన చరిత్ర నరసింహారావుదన్నారు. గతంలో ఇతను అనేకసార్లు సస్పెండైనా ఇతని వైఖరిలో మార్పులేదని, ప్రభుత్వం అధికారులు వెంటనే వీఆర్వో నరసింహారావు, రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, పౌర హక్కుల సంఘం నాయకులు చికినం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఐ కోటేశ్వరరావు

రెవెన్యూ సదస్సుకు మూడు అర్జీలు

రొంపిచర్ల: మండలంలోని అలవాల గ్రామ సచివాలయంలో సోమవారం గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సుకు ఇద్దరు రైతులు తమ పొలాన్ని సబ్ డివిజన్ చేయించాలని అర్జీ అందజేయగా, ఆన్‌లైన్ అడంగల్‌లో తమ భూములు నమోదు చేయించాలని మరో రైతు అర్జీ అందజేశారు. ఈ సదస్సులో ఆర్ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్ రవికుమార్, విలేజ్ అసిస్టెంట్ వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పల్నాటి బాలోత్సవంలో కాకాని విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు గోవిందరాజులు, ఉపాధ్యాయులు

నరసరావుపేట రూరల్: పల్నాటి బాలోత్సవంలో కాకాని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పలు విభాగాల లో బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిశెట్టి గోవిందరాజులు సోమవారం తెలిపారు. బుర్రకథలు, క్విజ్, కథా, విశ్లేషణ, కథా రచన, వక్తృత్వం, కోలాటం, మైమ్, లఘునాటికలో జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినట్లు వివరించారు. దాదాపు 11 విభాగాలలో 62 మంది విద్యార్థులు బహుమతులు పొందినట్లు తెలిపారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు దోహదపడతాయని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

గణపవరం జెడ్పీ హైస్కూలు విద్యార్థుల ప్రతిభ

నాదెండ్ల: పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగిన బాలోత్సవాల్లో గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభతో బహుమతులు సాధించారు. ఈ నెల 28,29 తేదిల్లో జరిగిన బాలోత్సవాల్లో క్విజ్ సీనియర్స్ విభాగంలో సీహెచ్ సాత్విక, టి.జగన్‌మోహన్ రెడ్డి, కె.హిమ ఆదిత్య ద్వితీయ స్థానం సాధించారు. మ్యాప్ పాయింటింగ్ సీనియర్స్ విభాగంలో షేక్ రాసిక్ తృతీయ స్థానం, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్ జూనియర్స్ విభాగంలో పి.కృపాకర్, ఐ.ప్రవీణ్, వి.శివ తృతీయ స్థానం సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన సోషల్ ఉపాధ్యాయుడు బాజీబాబును హెచ్ఎం కృష్ణానాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.